


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
08 ఆగస్టు 2024
పేజీలు: 02




## మెడల్స్ టేబుల్

| దేశం | బంగారం | వెండి | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|
| అమెరికా | 27 | 35 | 32 | 94 |
| చైనా | 25 | 23 | 17 | 65 |
| ఆస్ట్రేలియా | 18 | 12 | 11 | 41 |
| ఫ్రాన్స్ | 13 | 17 | 21 | 51 |
| బ్రిటన్ | 12 | 17 | 20 | 49 |
| జపాన్ | 12 | 6 | 13 | 31 |
| ఇండియా | 0 | 0 | 3 | 3 |

### నాపై రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా..

# రెజ్లింగ్‌కు వినేశ్ గుడ్‌బై

## నాకు పోరాడే బలం లేదు: వినేశ్ ఫోగాట్




భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించింది. పారిస్ గడ్డపై త్రివర్ణపతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించాలనుకున్న ఆమె ఆశలను అదనపు బరువు తుడిచివేసింది. దీంతో రెజ్లింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'రెజ్లింగ్ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. మీక, నా ధైర్యం విచ్ఛిన్నమైంది. నాకు ఇంకా పోరాడే బలం లేదు' అని పేర్కొంది. రెజ్లింగ్ 2001-2024 గుడ్‌బై అంటూ ట్వీట్ చేసింది. పారిస్ ఒలింపిక్స్ 50 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు అధికంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడింది. అయితే తనను అనర్హురాలిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఫోగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేసన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. తనను సిల్వర్ మెడల్‌కు అర్హురాలినని తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తున్నది. దీనిపై ఆర్బిట్రేషన్ తీర్పు వెలువరించాల్సి ఉన్నది. ఈలోపే ఆమె అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించింది. గత రెండు ఒలింపిక్స్‌లను తలపిస్తూ పారిస్‌లోనూ వినేశ్‌కు చేదు అనుభవమే ఎదురైంది. రియోలో కాలు విరిగితే..టోక్యోలో ఆదిలోనే ఓటమి..ఇప్పుడు పారిస్‌లో అనర్హత వేటు ఫోగాట్ పతక కలను చిదిమేశాయి. గత ఏడాది కాలంగా పాలకులతో చేస్తున్న పోరాటం ఓవైపు అయితే తనపై వస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు బౌట్‌లో శక్తికి మించి పోరాడిన వినేశ్.. పారిస్‌లో పతకమే లక్ష్యంగా పోటీకి దిగింది. తన రెగ్యులర్ విభాగం 53కిలోలు కాకుండా ఈసారి 50కిలోల కేటగిరీ ఎంచుకున్న ఫోగాట్‌కు యు సుసాకీ రూపంలో ఫేవరేట్ ఎదురైనా వెరువకుండా పోరాడి సంచలన విజయం సాధించింది. అదే జోరులో క్వార్టర్స్, సెమీస్ బౌట్లలో ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా నిలిచింది.

### మెడల్ సాధించకపోయినా రూ.25,00,000 రివార్డ్


పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ వినేశ్ ఫొగట్‌కు రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. వినేశ్ మెడల్ గెలిచినట్లేనని వర్సిటీ ఛాన్సలర్ అశోక్ తెలిపారు. 'వినేశ్ మా యూనివర్సిటీలో MA (సైకాలజీ) స్టూడెంట్. ఆమె దృఢ సంకల్పం, స్కిల్ చాలా గొప్పవి' అని ఆయన చెప్పారు. తమ విద్యార్థులు గోల్డ్ గెలిస్తే రూ.50 లక్షలు, సిల్వర్‌కు రూ.25 లక్షలు, బ్రాంజ్ గెలిస్తే రూ.10 లక్షలు ఇస్తామని గతంలో LPU ప్రకటించింది.

**వినేశ్ ఫొగట్ సాధించిన ఘనతలివే**

* 2014, 2018, 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకాలు.
* ఒకే ఏడాది(2018) కామన్ వెల్త్ గేమ్స్, ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ గెలిచిన భారత తొలి మహిళా రెజ్లర్‌గా రికార్డు.
* 2016, 2020, 2024 ఒలింపిక్స్ బరిలో నిలిచారు.

### సిల్వర్ ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన వినేశ్ ఫొగాట్!

అధిక బరువు ఉన్నారనే కారణంతో అనర్హత వేటుకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగట్ క్రీడా కోర్టు(సీఎఎస్)ను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. తాను ఫైనల్‌కు చేరడంతో సిల్వర్ ఇవ్వాలని ఆమె కోరినట్లు సమాచారం. తనను ఎలిమినేట్ చేయడం సరికాదని పేర్కొన్నట్లు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై కోర్టు ఇవాళ ఉదయం తీర్పు ఇవ్వనుంది. ఒకవేళ కోర్టు సానుకూలంగా స్పందిస్తే ఫైనల్లో ఓడిన రెజ్లర్‌తో వినేశ్ రజతం అందుకునే అవకాశం ఉంది.






### సిల్వర్ మెడలిస్ట్ రివార్డులు, సౌకర్యాలు వినేశ్‌కు అందిస్తాం: సీఎం

రెజ్లర్ వినేశ్ ఫొగట్ అధిక బరువు కారణంతో ఒలింపిక్స్ ఫైనల్‌లో ఆడకపోయినా ఆమె ఛాంపియనేనని హరియాణా సీఎం నయాబ్ సైనీ కొనియాడారు. ఆమెను చూసి గర్విస్తున్నామన్నారు. ఒలింపిక్ మెడలిస్ట్ మాదిరిగానే ఆమెకు స్వాగతం పలకాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు Xలో తెలిపారు. ఒలింపిక్ రజత పతక విజేతకు దక్కే అన్ని సన్మానాలు, రివార్డులు, సౌకర్యాలను వినేశ్‌కు అందిస్తామని ప్రకటించారు.



### కిలో తేడాతో కాంస్యం కోల్పోయిన మీరాబాయి

రిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం త్రుటిలో చేజారింది. బుధవారం అర్ధరాత్రి జరిగిన మహిళల 49కిలోల విభాగంలో బరిలోకి దిగిన భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయిచాను కిలో తేడాతో కాంస్య పతకం కోల్పోయింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన పోరులో మణిపూర్ మణిపూస మీరాబాయి 199 కిలోలతో నాలుగో స్థానంలో నిలిచింది. స్నాచ్‌లో 88 కిలోలు ఎత్తిన చాను..క్లీన్ అండ్ జర్క్‌లో 111కిలోలతో మొత్తంగా 199కిలోల బరువెత్తింది. గత(టోక్యో) ఒలింపిక్స్‌లో రజత పతకంతో మెరిసిన మీరాబాయి.. ఈసారి అభిమానులను నిరాశపరిచింది.



### ఫిబ్రవరిలో తిరిగి రానున్న సునీతా విలియమ్స్!

అంతరిక్ష వ్యోమగామి సునీతా విలియమ్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తిరిగి భూమి మీదకు రానున్నట్లు నాసా తెలిపింది. ఒకవేళ బోయింగ్ స్టార్ లైనర్ సురక్షితం కాదని భావిస్తే స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ ద్వారా తీసుకొస్తామని పేర్కొంది. దీనికి సంబంధించిన స్పేస్‌ఎక్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. కాగా జూన్ 5న సునీత రోదసిలోకి వెళ్లగా స్పేస్ క్రాఫ్ట్‌లో సమస్య తలెత్తడంతో ఆమె అక్కడే ఉండిపోయారు.



### ఎల్లుండి వయనాడ్‌కు మోదీ?

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10న వయనాడ్‌లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక విమానంలో కన్నూర్ వెళ్లనున్న ఆయన కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేస్తారని సమాచారం. అనంతరం ఈ ఘటనతో నిరాశ్రయులై సహాయ శిబిరాల్లో ఆవాసం పొందుతున్న వారిని పరామర్శించనున్నారు. కాగా వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

### గర్ల్ ఫ్రెండ్‌కు ఐఫోన్ కోసం అమ్మ బంగారం దొంగతనం!

ఓ బాలుడు తన గర్ల్ ఫ్రెండ్‌కు ఐఫోన్ కొనిచ్చేందుకు తన తల్లి బంగారాన్నే దొంగతనం చేశాడు. ఈ ఘటన ఢిల్లీలోని నజఫ్‌గఢ్‌లో జరిగింది. ఓ పాఠశాలలో 9వ తరగతి చదివే అబ్బాయి తన గర్ల్‌ఫ్రెండ్‌ను ఇంప్రెస్ చేసేందుకు ఐఫోన్ కొనిద్దామనుకున్నాడు. డబ్బులు లేక అతడి తల్లి నగలనే దొంగిలించి, విక్రయించగా వచ్చిన రూ.50 వేలతో ఐఫోన్ కొనిచ్చాడు. నగలు చోరీ అయ్యాయని తల్లి ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణలో ఈ విషయం బయటపడింది.



### బ్లాక్‌బస్టర్ సీక్వెల్‌తో రాబోతున్న తాప్సీ?

దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు తెరకెక్కించిన 'ఝుమ్మంది నాదం' మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది పంజాబీ బ్యూటీ తాప్సీ. ఆ సినిమాతో హీరోయిన్‌గా మంచి గుర్తింపును తెచ్చుకుని అటుపై తెలుగులో చాలా చిత్రాల్లో నటించింది. ఇక టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌కి వెళ్లి అక్కడ కూడా సూపర్ సక్సెస్ సాధించింది. నార్త్‌లో అమ్మడికి స్టార్ స్టేటస్ రావడంతో, తెలుగు సినిమాలను బాగా తగ్గించేసింది. అయితే, ఇప్పుడు తిరిగి తెలుగులో ఓ సినిమాతో రీ-ఎంట్రీకి సిద్ధమవుతోందట తాప్సీ. ఆమె నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆనందోబ్రహ్మ' చిత్రానికి సీక్వెల్ మూవీని త్వరలోనే ప్రారంభించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సీక్వెల్ చిత్రాన్ని దర్శకుడు మహి వి రాఘవ్ డైరెక్ట్ చేయనున్నారట. ఈ సినిమాతో తాప్సీ తిరిగి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది. మరి ఆనందోబ్రహ్మ సీక్వెల్ మూవీతో తాప్సీ ఎలాంటి రీ-ఎంట్రీ ఇస్తుందో చూడాలి అంటున్నారు ఆమె అభిమానులు. ఇక ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### శోభితా ధూళిపాళ్లతో నాగ చైతన్య ఎంగేజ్మెంట్


అక్కినేని యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అక్కినేని నాగ చైతన్య హీరోగా లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి హీరోయిన్ గా దర్శకుడు చందూ మొండేటి కాంబినేషన్ లో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ "తండేల్" చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా వార్తలతో పాటుగా నాగ చైతన్య అలాగే ప్రముఖ టాలెంటెడ్ నటి శోభితా ధూళిపాళ్ల నేడు ఎంగేజ్మెంట్ చేసుకోబోతున్నారని పలు రూమర్స్ ఇప్పుడు ఊపందుకున్నాయి. నాగ చైతన్య అలాగే శోభితలు కుటుంబీకుల సమక్షంలో నేడు ఒక ప్రయివేట్ వేడుక లాంటిది చేసుకొని హైదరాబాద్ లోనే ఒకటి కానున్నారు అంటూ పలు వార్తలు ఇప్పుడు వైరల్ గా మారాయి. అయితే కొన్నాళ్లనుంచి వీరిపై కొన్ని పుకార్లు ఉన్నాయి కానీ ఇపుడు వాటిని అయితే చైతు, శోభితలు నిజం చేయనున్నారని టాక్. మరి అధికారికంగా క్లారిటీ వస్తే తప్ప ఈ విషయంలో ఏది నమ్మడానికి లేదు. మరి శోభిత తెలుగు అమ్మాయే కాగా ఆమె తెలుగుతో పాటుగా హిందీ, తమిళ్ సహా హాలీవుడ్ చిత్రాలని కూడా ఆమె చేసింది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## డీజీపీగా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి.. ఐదుగురు సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతి

రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. అదనపు డీజీలుగా ఉన్న ఐదుగురు అధికారులను డీజీపీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డితోపాటు అభిలాష బిస్త్, సౌమ్య మిశ్రా, షికా గోయల్‌ను డీజీపీలుగా ప్రమోట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, సీఐడీ చీఫ్ షికా గోయల్ పనిచేస్తున్నారు. వారు అవే స్థానాల్లో కొనసాగుతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.



## రెజ్లర్ అంతిమ్ అక్రిడేషన్‌ను రద్దు చేసిన ఐఓఏ

భారత రెజ్లర్ అంతిమ్ పంఘల్ పారిస్ ఒలింపిక్స్ అక్రిడేషన్‌ను ఇండియన్ ఒలింపిక్ అసోషియేషన్(ఐఓఏ) రద్దు చేసింది. అంతిమ్ అక్రిడేషన్ కార్డుతో ఆమె సోదరి నిశా ఒలింపిక్ విలేజీలోకి ప్రవేశించడమే దీనికి కారణం. అక్రమంగా ప్రవేశించిన నిశాను అదుపులోకి తీసుకున్న పోలీసులు కాసేపటికే విడుదల చేశారు. పోలీసుల ఫిర్యాదుతో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారని అంతిమ్‌ను టీమ్‌తో సహా భారత్ పంపనున్నట్లు ఐఓఏ పేర్కొంది.




# యూపీఐ చెల్లింపుల్లో ఆర్‌బీఐ కీలక మార్పులు

ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన నిర్ణయాల వెల్లడి సందర్భంగా గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం కీలక ప్రకటనలు చేశారు. యూపీఐ లావాదేవీల విషయంలో ముఖ్యమైన ప్రతిపాదనలు వెల్లడించారు.

యూపీఐ ద్వారా చేసే పన్ను చెల్లింపుల పరిమితిని పెంచనున్నట్లు దాస్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రూ.1 లక్షను రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. ఫలితంగా వ్యక్తిగత ఆదాయపు పన్ను, ఆస్తి పన్ను, ముందస్తు పన్ను చెల్లింపులు చేసేవారు ఒక లావాదేవీలో రూ.5 లక్షల వరకు చెల్లించే అవకాశం ఉంది. యూపీఐ చెల్లింపుల పరిమితిని సవరించడం కొత్తేమీ కాదు. 2023 డిసెంబరులోనే వైద్య ఖర్చులు, విద్యాసంస్థల్లో ఫీజులను యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు చెల్లించే అవకాశాన్ని కల్పించింది. అంతకుముందు క్యాపిటల్ మార్కెట్లు, బీమా, విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌ల చెల్లింపుల పరిమితిని సైతం రూ.2 లక్షలు చేసింది. మరోవైపు ఐపీఓల్లో పెట్టుబడి, రిటైల్ డైరెక్ట్ స్కీముల్లోనూ ఒక్క లావాదేవీకి యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు చెల్లించే అవకాశం ఇచ్చింది.

ఇప్పటివరకు రూ.లక్షకు మించి పన్ను చెల్లించాల్సి వచ్చినవారు క్రెడిట్, డెబిట్ కార్డులను వాడేవారు. లేదా బ్యాంకుకు వెళ్లి చేసేవారు. కార్డుల ద్వారా అయితే సీవీవీ, ఎక్స్‌పైరీ తేదీ సహా ఇతర వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం ఓటీపీతో ధ్రువీకరించాలి. పైగా కార్డులపై ఉన్న నిబంధనల ప్రకారం కొన్నిరకాల రుసుములు కూడా చెల్లించాల్సి వచ్చేది. యూపీఐ చెల్లింపుల వల్ల అలాంటి ఇబ్బందులేవీ ఉండవు. కేవలం పిన్ ఎంటర్ చేసి పన్ను కట్టేయొచ్చు.

యూపీఐలో డెలిగేటెడ్ చెల్లింపుల వ్యవస్థ

యూపీఐ (UPI)లో డెలిగేటెడ్ చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ సదుపాయం వల్ల ఒక వ్యక్తి (ప్రైమరీ యూజర్) తన బ్యాంకు ఖాతా నుంచి నిర్దేశిత పరిమితి వరకు యూపీఐ లావాదేవీ చేసేందుకు మరొక వ్యక్తి (సెకండరీ యూజర్)కి అనుమతి ఇవ్వొచ్చు. సెకండరీ యూజర్‌కు యూపీఐకి అనుసంధానించిన బ్యాంకు ఖాతా ఉండాల్సిన అవసరం కూడా లేదు. కుటుంబసభ్యులను దృష్టిలో ఉంచుకొని దీన్ని తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఒకరు తమ బ్యాంకు ఖాతా నుంచి యూపీఐ లావాదేవీ చేసేందుకు మరో కుటుంబసభ్యుడికి అనుమతి ఇచ్చే అవకాశం లభిస్తుంది. దీనిపై కొంత పరిమితి విధిస్తే సరిపోతుంది. ఫలితంగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింత విస్తరించే అవకాశం ఉంది. ఇంట్లో సంపాదన లేని సభ్యులు ఏదైనా అవసరం నిమిత్తం బయటకు వెళ్లినప్పుడు చెల్లింపులు చేయాల్సివస్తే ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.



## ఈ కష్టసమయంలో మా అమ్మను చూడలేకపోతున్నా..

### హసీనా కుమార్తె భావోద్వేగ పోస్ట్

ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారడంతో పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాగ్రహానికి జడిసి ప్రధాన మంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి దేశం వీడారు. ప్రస్తుతం హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై హసీనా కుమార్తె సైమా వాజెద్ స్పందించారు. ఈ కష్టసమయంలో తన తల్లిని చూడలేకపోతున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'నేను ఇష్టపడే నా దేశం బంగ్లాదేశ్‌లో జరిగిన ప్రాణనష్టం చూసి గుండె పగిలింది. ఈ కష్ట సమయంలో నా తల్లిని చూడలేకపోయాననే, కౌగిలించుకోలేకపోయానే అన్న బాధ నా గుండెను పిండేస్తోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థలో రీజినల్ డైరెక్టర్‌గా నా విధి నిర్వహణకు కట్టుబడి ఉండాల్సి వచ్చింది' అని సైమా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, షేక్ హసీనాకు ఇద్దరు పిల్లలు అన్న విషయం తెలిసిందే. కుమార్తె సైమా వాజెద్, కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఉన్నారు. సైమా ఈ ఏడాది ఫిబ్రవరిలో డబ్ల్యూ హెచ్‌వోకు ఎన్నికయ్యారు. ఆగ్నేయ ఆసియా రీజినల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో నివాసం ఉంటున్నారు. ఇక హసీనా కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న విషయం తెలిసిందే.




## భారీగా ఉద్యోగులను తొలగించిన డెల్

ప్రముఖ కంప్యూటర్ల తయారీ సంస్థ డెల్ సేల్స్ విభాగంలోని 12,500 మంది ఉద్యోగులను తొలగించింది. AIపై ఎక్కువగా దృష్టి పెట్టడంతో పాటు వ్యాపారాన్ని పునరుద్ధరించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగం కోల్పోయిన వారిలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారు ఉన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి ఈ విషయాన్ని మెమోలో తెలియజేసినట్లుగా పేర్కొంది.

## అమెరికా జాతీయ పక్షిగా బాల్డ్ ఈగల్.. 240 ఏండ్ల తర్వాత ఖరారు


అమెరికా జాతీయ పక్షిగా 'బాల్డ్ ఈగల్'ను గుర్తిస్తూ ఆ దేశ సెనెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 240 ఏండ్లుగా ఈ పక్షిని అమెరికాలో అధికార చిహ్నంగా వాడుతున్నా, జాతీయ పక్షి హోదా మాత్రం ఇప్పటివరకు దక్కలేదు. రెండు వందల ఏండ్లకుపైగా ఎదురుచూపులకు ముగింపు పలుకుతూ, సెనెట్ (పార్లమెంట్ ఎగువసభ) జాతీయ పక్షిని తాజాగా ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. మిన్నెసోటా డెమొక్రాట్ ఎమి క్లోబుచర్ బిల్లును ప్రతిపాదించగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 'గత 240 ఏండ్లుగా అమెరికా విలువలకు 'బాల్డ్ ఈగల్' ఒక చిహ్నంగా నిలిచింది. ఇన్నేండ్లకు జాతీయ పక్షిగా గుర్తింపు లభించింది' అని సెనెటర్ ల్యూమిస్ అన్నారు. అమెరికా ఏర్పడినప్పుడు ఆ దేశ రూపకర్తలు 'బాల్డ్ ఈగల్'నే గుర్తుగా ఎంచుకున్నారు. 1940లో ఈ పక్షుల్ని వేటాడటంపై నిషేధం విధించారు.





## యష్ భారీ చిత్రం టాక్సిక్ స్టార్ట్

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన గత చిత్రాలు కేజీయఫ్ 1, కేజీయఫ్ 2 లతో తాను పాన్ ఇండియా స్టార్ గా మారిపోగా ఆ సినిమాల అంచనాలు యష్ నెక్ట్స్ మ్యాచ్ చేయగలడా లేదా అనే సంశయంలో అనౌన్స్ చేసిన భారీ చిత్రమే "టాక్సిక్". మళయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ప్లాన్ చేసిన ఈ భారీ యాక్షన్ అండ్ గ్యాంగ్ స్టర్ డ్రామాపై సాలిడ్ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆల్రెడీ షూటింగ్ మొదలు పెట్టుకున్న ఈ చిత్రంపై యష్ లేటెస్ట్ గా ఇచ్చిన అప్డేట్ ఒకటి వైరల్ గా మారింది. ఒక పిక్ పెట్టి జర్నీ ఇప్పుడే మొదలైంది అంటూ తాను పోస్ట్ చేసాడు. దీనితో యష్ ఫ్యాన్స్ మంచి ఎగ్జైట్ అవుతున్నారు. మరి ఇందులో యష్ లుక్ కూడా మంచి స్టైలిష్ గా కనిపిస్తుండడంతో ఈ సినిమా నుంచి మాత్రం తమకి మంచి ట్రీట్ ఉండబోతుంది అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఇక ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ తదితర భారీ తారాగణం నటిస్తుండగా కన్నడ ప్రముఖ నిర్మాణ సంస్థ కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే వరల్డ్ వైడ్ గా ఈ చిత్రం 2025,ఏప్రిల్ 10న రిలీజ్ కాబోతుంది.



## ధనుష్ జోడీగా కృతిసనన్

కథాంశాల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నది బాలీవుడ్ కథానాయిక కృతిసనన్. యాక్షన్ చిత్రాలతో పాటు లవ్‌స్టోరీస్‌కు ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. ధనుష్ కథానాయకుడిగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో 'తేరే ఇష్క్ మే' పేరుతో ఓ సినిమా తెరకెక్కనుంది. 'రాంజనా' తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న ఈ సినిమా బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ చివరకు కృతిసనన్‌ను ఖరారు చేశారని సమాచారం. 'రాంజనా' తరహాలోనే హృద్యమైన ప్రేమకథాంశం కావడంతో కృతిసనన్ వెంటనే ఈ సినిమాకు ఓకే చెప్పిందట. అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు.